వైద్య ఆరోగ్య శాఖలో ఔట్ సోర్సింగ్ భర్తీ జాబితాపై అనుమానాలు!

- అవకతవకలు జరిగాయంటూ పలువురి ఆరోపణ

మంచిర్యాల అర్బన్, జూలై 1 : జాతీయ ఆరోగ్య మిషన్ కింద మంచిర్యాల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో ఎన్‌హెచ్‌ఎం ఒప్పంద, పొరుగు సేవల ప్రతిపాదికన పోస్టుల భర్తీకి సంబంధించి ఆ శాఖ అధికారులు ఇటీవల మెరిట్ అండ్ సెలక్షన్ జాబితా విడుదల చేశారు. అయితే ఈ జాబితా తయారీలో అవకతవకలు జరిగాయంటూ పలువురు దరఖాస్తుదారులు సోమవారం కార్యాలయానికి వచ్చి, అభ్యంతరాలను వ్యక్తం చేశారు. ఇందుకు సంబంధించి ఏ పద్ధతిన ప్రక్రియ జరిగిందో వివరణ ఇవ్వాలంటూ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారికి ఓ అభ్యర్థి రాత పూర్వకంగా ఫిర్యాదు చేశాడు. ఈ విషయంపై జిల్లా వైద్యాధికారి డా.అనితను వివరణ కోరగా, ఈ భర్తీ విషయమై వచ్చిన అభ్యంతరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకవెళ్లి, రెండు, మూడు రోజుల్లో పూర్తి వివరాలను వెల్లడిస్తామని సమాధానం ఇచ్చారు.

నేతకాని కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నేతకాని మహర్ నాయకులు

మంచిర్యాలటౌన్, జూలై 1 : ప్రభుత్వం ప్రత్యేక నేతకాని కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని నేతకాని మహర్ సంక్షేమ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి గోళ్ల రాజమల్లు మాట్లాడుతూ.. లోక్ సభ ఎన్నికల సమయంలో నేతకాని కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని, హామీని నెరవేర్చాలని కోరారు. ఎవరినీ అడగకుండానే తెలంగాణాలో 16 సామాజికవర్గాలకు ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటుచేశారని, వెంటనే నేతకాని కార్పొరేషన్‌ను ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. ప్రతీ బడ్జెట్‌లో నేతకానీల సంక్షేమం కోసం రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని, హైదరాబాద్ కేంద్రంలో నేతకాని భవన్‌కు ఐదెకరాలు కేటాయించాలని, అందుకు రూ.10 కోట్లు కేటాయించాలన్నారు. నేతకాని సామాజికవర్గానికి చెందిన వారికి నామినేటెడ్ పదవులు, పోడు వ్యవసాయం చేస్తున్న నేతకానీలకు భూ హక్కు పత్రాలను ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కళలి నర్సయ్య, ఉపాధ్యక్షుడు గోమాస రాజు, రాష్ట్ర యువజన సంఘం అధ్యక్షుడు అనపర్తి యువరాజ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గం సంతోష్, రాష్ట్ర నాయకులు పెరుగు తిరుపతి, సల్లూరి మహేశ్, కొండగొర్ల శ్రీనివాస్, భీమయ్య, రాంటెంకి రాజలింగు తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ

- వృథాగా పోతున్న నీరు

చిక్లి వాగు గ్యాస్ గోదాం పక్కన పైపులైన్ లీకేజీ

వాంకిడి, జూలై 1: మండల కేంద్రంలోని చిక్లి వాగు గ్యాస్ గోదాం పక్కన మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీతో నీరు వృథాగా పోతున్నది. వారం రోజులుగా భగీరథ నీటి సరఫరా నిలిచిపోయినా అధికారులు పట్టించుకోవడం లేదని వాంకిడి గ్రామ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లీకేజీ అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

- సంబంధిత అధికారుల సమన్వయంతో చర్యలు
- మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్లు కుమార్ దీపక్, వెంకటేశ్ ధోత్రే
- ప్రజావాణిలో అర్జీల స్వీకరణ

నస్పూర్ : ప్రజావాణికి వచ్చిన అర్జీదారులు

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్ : అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

నస్పూర్, జూలై 1 : ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంపై సంబంధిత అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం అదనపు కలెక్టర్ మోతీలాల్, ఆర్డీవో హరికృష్ణతో కలిసి ప్రజల నుంచి కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా దండేపల్లి, జైపూర్, మంచిర్యాల, నస్పూర్, కన్నెపల్లి, మిట్టపల్లి, జన్నారం మండలాల నుంచి వచ్చిన ప్రజలు దరఖాస్తులు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణిలో 67 దరఖాస్తులు వచ్చాయన్నారు. ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సత్వర పరిష్కారానికి కృషి : ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జూన్ 24 : ప్రజావాణి కార్యక్రమంలో సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి సత్వరమే పరిష్కారానికి కృషి చేస్తామని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దాసరి వేణు, ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వరరావుతో కలిసి కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్‌లో లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం వివిధ సమస్యలపై దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కోటపల్లిలో..

కోటపల్లి, జూలై 1 : కోటపల్లి ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజలు తమ సమస్యలపై ఫిర్యాదులు సమర్పించారు. ఎంపీడీవో ఆకుల భూమయ్య స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో ముల్కల్ల సత్యనారాయణ, ఏవో మహేందర్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ బద్రినాథ్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

వేమనపల్లిలో..

వేమనపల్లి, జూలై 1 : వేమనపల్లి ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో సత్యప్రసాద్, ఏపీఎం ఉమారాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సువర్ణ, ఎంఐసీ కో-ఆర్డినేటర్ సుజాత, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజలింగు, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా డాక్టర్స్ డే

దండేపల్లి : వైద్యురాలిని సన్మానిస్తున్న సిబ్బంది

మంచిర్యాల అర్బన్, జూలై 1 : జిల్లాలో సోమవారం డాక్టర్స్ డే ఘనంగా నిర్వహించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మంచిర్యాల జిల్లా జనరల్ సెక్రటరీ చందూరి మహేందర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జనరల్ దవాఖాన సూపరింటెండెంట్ హరీశ్ చంద్రారెడ్డి, మాతా శిశు దవాఖాన వైద్యుడు వేదవ్యాస్, రక్త నిధి కేంద్రం వైద్యులు నాగమల్లేశ్వర రావు, ప్రియాంకా సక్సేనా, ప్రశాంత్, అభిషేక్‌ను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఐఆర్‌సీఎస్ మంచిర్యాల కమిటీ సభ్యులు, రక్త నిధి సిబ్బంది పాల్గొన్నారు.

చెన్నూర్‌లో..

చెన్నూర్, జూలై 1 : చెన్నూర్ ప్రభుత్వ దవాఖానలో వైద్యులు, వైద్య సిబ్బంది కేక్ కట్ చేశారు. అనంతరం వైద్యులకు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. వైద్యులను ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్(ఆవోపా) నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో దవాఖాన సూపరింటెండెంట్ సత్యనారాయణ, డాక్టర్లు స్వాతిక జైస్వాల్, శ్రుతకీర్తి, సిబ్బంది, ఆవోపా అధ్యక్షుడు పుల్లూరి సత్తయ్య, ఉపాధ్యక్షుడు వెంకటనర్సయ్య, నాయకులు గన్ను శ్రీరాములు, పాండురంగం, శంకర్, రాజబాపు, శ్రీనివాస్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

దండేపల్లిలో..

దండేపల్లి, జూలై 1 : దండేపల్లి మండల కేంద్రంతో పాటు ద్వారకలో డాక్టర్స్‌డే నిర్వహించారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ద్వారక పీహెచ్‌సీలో డాక్టర్ సాగరికను సన్మానించారు. డాక్టర్ బిదన్‌చంద్రరాయ్ గొప్పదనం, వారి సేవాభావం గురించి వివరించారు. మండల కేంద్రంలో ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో పీహెచ్‌సీ వైద్యుడు సతీశ్‌కుమార్‌ను సన్మానించారు. ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కొల్లూరి రవికుమార్, లయన్స్‌క్లబ్ సభ్యులు మల్లికార్జున్, సత్యనారాయణ, లక్ష్మణ్, రాంచందర్ తదితరులు ఉన్నారు.

జన్నారంలో..

జన్నారం, జూలై 1 : జన్నారం పీహెచ్‌సీలో వైద్యురాలు ఉమశ్రీతో పాటు స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలు ఇతర సిబ్బందిని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు సతీశ్, సందీప్, జగదీశ్, మల్యాల బాపన్న ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

మంచిర్యాల అర్బన్ : మంచిర్యాల ప్రభుత్వ దవాఖానలో

చెన్నూర్ : ప్రభుత్వ దవాఖానలో కేక్ కట్ చేస్తున్న వైద్యులు

జన్నారంలో వైద్య సిబ్బందిని సన్మానిస్తున్న లయన్స్ సభ్యులు

ప్రజల కోసమే పోలీసులు

నెన్నెల, జూలై 1 : ప్రజల కోసమే పోలీసులు ఉన్నారని బెల్లంపల్లి రూరల్ సీఐ అష్టలొద్దీన్ అన్నారు. చిత్తాపూర్‌లో ఆదివారం రాత్రి పల్లెనిద్ర చేపట్టారు. ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. బురదమయంగా ఉన్న పల్లెకు బీటీ రోడ్డు వేయాలని, బస్సు చిత్తాపూర్ వరకు నడిపించాలని కోరారు. సమస్యలను ఉన్నతాధికులకు తెలియజేసి, పరిష్కరించేందుకు కృషి చేస్తామని సీఐ చెప్పారు. ఎస్ఐ ప్రసాద్, సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.

తల్లీ కూతుళ్ల ఆత్మహత్యాయత్నం

కాగజ్‌నగర్, జూలై 1: కుటుంబ కలహాలతో తల్లీకూతుళ్లు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సోమవారం మండలంలోని గజ్జిగూడలో చోటుచేసుకున్నది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గజ్జిగూడకు చెందిన ప్రతాప్ మద్యానికి బానిసై నిత్యం భార్యా పిల్లలను వేధిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం మనస్తాపం చెందిన భార్య వనిత, కూతుళ్లు లక్ష్మి, రమ్య, ఐశ్వర్య పురుగుల మందు తాగారు. స్థానికులు గమనించి కాగజ్‌నగర్‌లో ఎల్లాగౌడ్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. వైద్యులు పరీక్షించి రెఫర్ చేయగా, స్థానిక ప్రైవేట్ దవాఖానకు తరలించారు. తల్లి వనిత, కూతురు రమ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఈ విషయమై రూరల్ సీఐ రాంబాబు, రూరల్ ఎస్ఐలను సంప్రదించగా అందుబాటులో లేరు.

రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సురేశ్

చెన్నూర్, జూలై 1: తెలంగాణ బీసీ యువజన సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా చెన్నూర్ పట్టణానికి చెందిన తాటికొండ సురేశ్‌ను నియమించినట్టు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్‌గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సురేశ్ గతంలో తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా పని చేస్తూ అనేక విద్యార్థి ఉద్యమాల్లో పాల్గొన్నారు. గత అనుభవాన్ని దృష్టిలో పెట్టుకొనే రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించినట్టు తెలిపారు.

నేడు సర్వసభ్య సమావేశం

వాంకిడి, జూలై 1 : మండల సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 11గంటలకు నిర్వహించనున్నట్లు వాంకిడి ఎంపీపీ విమలాబాయి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీటీసీ సభ్యులతో పాటు జడ్పీటీసీ, పీఏసీఎస్ చైర్మన్, మండల స్థాయి అధికారులు, అన్ని గ్రామాల ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు హాజరు కావాలని కోరారు.

వారసంతకు వేలం

తాండూర్, జూలై 1 : మండలంలోని కొత్తపల్లి పంచాయతీ పరిధిలో ప్రతి శనివారం నిర్వహించే కూరగాయలు, మేకల వారసంతకు 2024-25 సంవత్సరానికి గాను తొమ్మిది నెలలకు సోమవారం వేలం నిర్వహించారు. కూరగాయల సంతను మండల కేంద్రానికి చెందిన ఓలం తిరుపతి రూ. 3,33,000కు దక్కించుకున్నాడు. మేకల సంతకు ప్రభుత్వం నిర్ణయించిన ధర రాకపోవడంతో వేలం వాయిదా వేశారు. తిరిగి బుధవారం నిర్వహించనున్నట్లు కార్యదర్శి లక్ష్మణ్ తెలిపారు. ఎంపీడీవో పీ శ్రీనివాస్, ఎంపీవో అక్తార్ మొయినొద్దీన్, పంచాయతీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎల్కపల్లిలో..

పెంచికల్ పేట్, జూలై 1 : పెంచికల్ పేట్ మండల కేంద్రం ఎల్కపల్లిలో ప్రతి శుక్రవారం జరిగే వారసంతకు మంగళవారం వేలం నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీ నిబంధనలకు లోబడి వేలం పాట నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

చింతలమానేపల్లిలో..

చింతలమానేపల్లి, జూలై 1 : మండలంలోని రవీంద్ర నగర్-1 మార్కెట్ ఏరియాలో ప్రతీ శుక్రవారం నిర్వహించే కూరగాయల వారసంతకు 2024-25 సంవత్సరానికి గాను మంగళవారం వేలం నిర్వహించనున్నట్లు కార్యదర్శి విజయ్ తెలిపారు. ఉదయం 10 గంటలకు రవీంద్రనగర్-1 గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేకాధికారి, ఎంపీడీవో కోట ప్రసాద్ అధ్యక్షతన వేలం ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు రూ.30 వేల డిపాజిట్ చెల్లించి, వేలంలో పాల్గొనవచ్చని సూచించారు.

నేడు విద్యుత్ అంతరాయం

కోటపల్లి, జూలై 1 : కిష్టంపేట నుంచి కోటపల్లికి వెళ్లే 33 కేవీ లైన్ మరమ్మతుల కారణంగా కోటపల్లి, ఆలుగామ, దేవులవాడ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ వెంకటేశ్వర్లు తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

వేమనపల్లి, జూలై 1 : మండలంలోని నీల్వాయి సబ్ స్టేషన్ పరిధి గ్రామాలకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ దీక్షిత్ తెలిపారు. విద్యుత్ మరమ్మతులు చేపడుతున్నందున సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

రెబ్బెన, జూలై 1: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని గోలేటి ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్ సుధీర్, రెబ్బెన ఇన్‌చార్జి రేంజ్ ఆఫీసర్ శ్రీధరచారి పేర్కొన్నారు. గోలేటిలో సోమవారం శ్రీ సేవాలాల్ చారిటబుల్ ట్రస్ట్, గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నేషనల్ ఎస్‌బీఐ ఫౌండేషన్ డే సందర్భంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వోలు కొమ్మలు, సతీశ్, బీట్ ఆఫీసర్ భుక్క రవిలతో పాటు గ్రామపెద్దలు, ట్రస్ట్ సభ్యులు ఉన్నారు.

పశువైద్య, పశు సంవర్ధక శాఖ అధికారిగా శంకర్

నస్పూర్, జూలై 1 : జిల్లా పశువైద్య, పశు సంవర్ధక శాఖ అధికారిగా డాక్టర్ ఈ శంకర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన రమేశ్ విరమణ పొందగా, శంకర్ అదనపు బాధ్యతలు స్వీకరించారు.

భాగస్వాములుగా ఉంటాం

కెరమెరి, జూలై 1 : పదవికాలం ముగిసినా ప్రజల సేవలో భాగస్వాములుగా ఉంటామని ఎంపీపీ పెందోర్ మోతీరాం స్పష్టం చేశారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ప్రతి అభివృద్ధి వెనుక ప్రజాప్రతినిధులతో పాటు సంబంధిత శాఖల అధికారుల పాత్ర సైతం ఉందని గుర్తు చేశారు. అనంతరం వివిధ ప్రభుత్వ శాఖల వారీగా నివేదికను అధికారుల సభలో ప్రస్తావించారు. జడ్పీటీసీ సెడ్మాకి భుర్సు తాబాయి, వైస్ ఎంపీపీ అబూల్ కలాం, తహసీల్దార్ దత్తు ప్రసాదరావు, ఎంపీడీవో మహ్మద్ అష్ఫుద్‌పాషా, ఏవో గోపికాంత్, ఏఈలు విశ్వేశ్వర్, నజీముద్దీన్, స్టీవెన్, విద్యుత్ సబ్ ఇంజనీర్ రమేశ్, పశువైద్య సహాయకురాలు సోనియా, ప్రత్యేకాధికారులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఘనంగా పోస్టల్ డే

కాసిపేట, జూలై 1 : కాసిపేటలో మంచిర్యాల సఖి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పోస్టల్ డే వేడుకలను నిర్వహించారు. కాసిపేట బ్రాంచ్ పోస్ట్‌మెన్ కడారి భూమన్నను సన్మానించారు. పీహెచ్‌సీలో డాక్టర్స్ డే నిర్వహించి, వైద్యురాలు దివ్యను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సఖి లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు బండ శాంకరి, ఉపాధ్యాయులు జ్యోతి, పల్లె కృష్ణ గోపాల్ రావు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ని చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం జీతం 16K to 18K ఏజెంట్ కమిషన్ 6K. 9640258899, 9640468899.

NT-325755

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన

నమస్తే తెలంగాణ

క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679

బెల్లంపల్లి: 91827 77671, 91827 77677

ప్రజలకు సేవచేసినప్పుడే గుర్తింపు

దహెగాం మండల సమావేశంలో జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు

మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు

దహెగాం, జూలై 1 : ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజలకు సేవలు అందించడం ద్వారానే గుర్తింపు లభిస్తుందని కుమ్రం భీం ఆసిఫాబాద్ జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు అన్నారు. ఎంపీపీ కంబగౌని సులోచన అధ్యక్షతన సోమవారం దహెగాం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. విద్యుత్ శాఖపై ఏఈ రవీందర్ నివేదికలు చదివి వినిపించారు. ఈ విషయంపై సభ్యులు మాట్లాడుతూ.. తరచుగా విద్యుత్ సమస్య ఉత్పన్నమవుతుందని సభ దృష్టికి తీసుకవచ్చారు. విద్యుత్ లైన్లపై చెట్లుకొమ్మలు ఉండడం వల్ల ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, కొమ్మలను తొలగిస్తున్నట్లు ఏఈ తెలిపారు. ఐసీడీఎస్‌పై చర్చ జరుగగా.. అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే కోడి గుడ్లు చిన్న సైజులో వస్తున్నాయని పలువురు సభ్యులు పేర్కొన్నారు. ఈ విషయంపై స్పందించిన జడ్పీ చైర్మన్, జడ్పీటీసీలు మాట్లాడుతూ.. సదరు కాంట్రాక్టర్‌తో మాట్లాడి పెద్ద సైజు కోడిగుడ్లను అందించేలా చర్యలు తీసుకోవాలని సూపర్‌వైజర్‌కు సూచించారు. అనంతరం మండల పరిషత్ పాలకవర్గం పదవీ కాలం ముగియనున్న నేపథ్యంలోఎంపీడీవో రాజేందర్ ఆధ్వర్యంలో కార్యాలయ సిబ్బంది సభ్యులను సన్మానించారు. జడ్పీ చైర్మన్, ఎంపీపీ, జడ్పీటీసీ తాళ్ల పల్లి శ్రీరామారావు, ఎంపీటీసీలను పూలమాలు, శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కవిత, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

మంచిర్యాల జిల్లావాసికి డాక్టరేట్

చెన్నై సౌతెర్న్ వెస్టర్న్ అమెరికన్ యూనివర్సిటీ ప్రధానం

అవార్డు అందుకుంటున్న కొండు నర్సింహారావు

మంచిర్యాల అర్బన్, జూలై 1 : మంచిర్యాల జిల్లా కేంద్రంలో అఖిల భారతీయ అయ్యప్ప ధర్మప్రచార సభ (ఏబీఏపీ) ద్వారా సామాజిక అధ్యాత్మిక సేవలందించినందుకు పట్టణానికి చెందిన కొండు నర్సింహారావుకు గౌరవ డాక్టరేట్ లభించింది. సౌతెర్న్ వెస్ట్రన్ అమెరికన్ యూనివర్సిటీ ఆదివారం చెన్నైలోని రామదాస్ హాల్‌లో గ్లోబల్ అచీవర్ కౌన్సిల్ అవార్డు ప్రధాన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా యూనివర్సిటీ స్నాతకోత్సవంలో నర్సింహారావుకు డాక్టరేట్, ప్రతిష్టాత్మక డిగ్రీతో పాటు సోషల్ వర్కర్ అవార్డును అందజేసింది. అవార్డు రావడంపై ఏబీఏపీ రాష్ట్ర అధ్యక్షుడు బేతి తిరుమల్ రావు, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చుంచు రాజ్‌కిరణ్, జిల్లా అధికార ప్రతినిధి బాస్కర్ల రాజేశం హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు.

ముదిరాజ్ మహాసభ యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సతీశ్

చెన్నూర్, జూలై 1 : ముదిరాజ్ మహాసభ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా చెన్నూర్ పట్టణానికి చెందిన నాయిని సతీశ్‌ను రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండప్రకాశ్ నియమించారు. ఈ మేరకు కరీంనగర్‌లో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో సతీశ్‌కు ఆయన నియామక పత్రాన్ని అందజేశారు. గతంలో ముదిరాజ్ మహాసభ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. ఈ సందర్భంగా యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పండుగ బాలు, జిల్లా అధ్యక్షుడు గరిగంటి కొమురయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి సాధనబోయిన కృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు.

'మహాలక్ష్మి'లో లోపాలను సవరించాలి

చెన్నూర్, జూలై 1 : ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకంలోని లోపాలను సవరించాలని ఐద్వా మంచిర్యాల జిల్లా గౌరవ అధ్యక్షురాలు దాసరి రాజేశ్వరి కోరారు. చెన్నూర్‌లో సోమవారం ఐద్వా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ పథకంలో లోపాల వల్ల మహిళలు ఇబ్బందులుపడుతున్నారన్నారు. మహిళా ప్రయాణికులు దిగే స్టాపుల్లో బస్సులను ఆపకుండా వెళ్లిపోతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకురాలు తుమ్మ రేణుక, బోగె నాగజ్యోతి, కరీమ, సంధ్య, ఉమరాణి, సమ్మక్క, రమాదేవి, స్వరూప, శంకరక్క, యామిని, బానక్క పాల్గొన్నారు.

కరెంటు సమస్య తీర్చాలని వినతి

మంచిర్యాలటౌన్, జూలై 1 : గడిచిన మూడు నెలలుగా నిత్యం కరెంటు సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, సరైన పరిష్కారం చూపాలని ఐదో వార్డు కౌన్సిలర్ సుదమల్ల హరికృష్ణ ఆధ్వర్యంలో ప్రజలు విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రావణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కరెంటు కోతలతో పడుతున్న తమ కష్టాలను సోమవారం విద్యుత్ ప్రజావాణి కార్యక్రమంలో ఎస్ఈకి ప్రజలు వివరించారు. కరెంటు ఎప్పుడు పోతుందో, ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి నెలకొన్నదని తెలిపారు. రాజీవ్‌నగర్ ఫీడర్ ప్రాంతాలకు మాత్రమే ఈ సమస్య ఉన్నట్లు, 3,4,5,16,17,18 వార్డుల్లో ప్రజలంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వెల్లడించారు. ఎక్కడ ఇబ్బంది తలెత్తినా మొత్తం ఏరియాకు కరెంట్ పోతున్నదని, అందుకు ప్రతీ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఆన్, ఆఫ్ స్విచ్‌లను ఏర్పాటుచేయాలని, లో వోల్టేజీ సమస్య లేకుండా చూడాలని కోరారు. ఐదోవార్డు ప్రజల వినతిపై ఎస్ఈ శ్రావణ్‌కుమార్ సానుకూలంగా స్పందించారు. కరెంటు సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

మళ్లీ దిగబడ్డ లారీలు..

లారీలు దిగబడడంతో భారీగా ట్రాఫిక్ జామ్

సిర్పూర్(టీ), జూలై 1 : వెంకట్రావ్‌పేట్ గ్రామంలోని ప్రధాన రహదారిపై సోమవారం తెల్లవారుజామున రెండు భారీ లారీలు గుంతలో దిగబడిపోయాయి. దీంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయి, దాదాపు 50 వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. మహారాష్ట్ర నుంచి తెలంగాణకు ఈ రోడ్డు మార్గం ద్వారానే నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ రోడ్డు గుండా అనుమతి లేకుండానే అధికలోడ్‌తో భారీ వాహనాలు వెళ్తున్నాయని ప్రజలు, ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఈ రోడ్డు పూర్తిగా ధ్వంసమవుతున్నదని వాపోతున్నారు. అక్కడక్కడగా భారీగా గుంతలు ఏర్పడడంతో వాహనాలు దిగబడిపోతున్నాయని అంటున్నారు. ఇప్పటి వరకు ఈ నాలుగు నెలల్లో 4 సార్లు లారీలు దిగబడి